క్లుప్తంగా

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఉండ్రాజవరం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అన్ని అంగన్వాడీ కేంద్రాలల్లో 5,515 మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. నులి పురుగుల వ్యాధి నివారణ, రక్తహీనత లేమి వంటి వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ప్రతి ఆరు నెలల ఒకసారి పంపిణీ చేసే ఈ మాత్రలను చిన్నారుల తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలకు తప్పనిసరిగా వేయాలని ఆయన కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలిస్తున్న మానవత సభ్యులు

తాళ్లపూడి: మండల కేంద్రం తాళ్లపూడిలో లక్ష్మి అనే యాచకురాలు ఆదివారం మృతి చెందింది. విషయాన్ని స్థానిక వీఆర్వో లీలవతి పోలీసులకు తెలపగా, వారు మానవత సభ్యులకు సమాచారం అందించారు. సంస్థ సభ్యులు మృతదేహాన్ని శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు జె.వెంకటేశ్వరరావు, రాజశేఖర్, పెమ్మాడి ప్రసాద్, గుప్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తాళ్లపూడి: మండలంలోని పేకాట స్థావరాలపై తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, ట్రైనీ ఎస్సై ఆదిత్య, పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. తిరుగుడుమెట్ట గ్రామంలో పలువురు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను పేకాడుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం వారి నుంచి రూ.2,560 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు. మండలంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు.

పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి



సమిశ్రగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు

నిడదవోలు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ-భక్తిని చాటాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని సమిశ్రగూడెం గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆదివారం నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం సాగించిన పోరాటంలో ఎందరో అమరులయ్యారని వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.నాగరాజునాయక్, ఈఓపీఆర్డీ డి.లక్ష్మినారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడిగా నాగేంద్ర



చాగల్లు: మండలంలోని ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బొల్లిన శివ నాగేంద్ర నియమితులయ్యారు. సభ్యులుగా మిరియాల సతీష్, దొంగ లక్ష్మినారాయణలు ఎంపికయ్యారు. ఈమేరకు సొసైటీ పాలకవర్గంను నియమిస్తు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నూతన కార్యవర్గాన్ని పలువురు రైతులు అభినందించారు. ఈ సొసైటీ అధ్యక్ష పదవి విషయంలో తీవ్రమైన పోటీ నెలకొనడంతో మొదటి దఫా జాబితాలో ప్రకటించకపోయినప్పటికిని ఎట్టకేలకు ఆదివారం ప్రకటించారు.

సహోద్యోగి వైద్యానికి జైలు సిబ్బంది చేయూత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఆధ్వర్యంలో, జైలు అధికారులు, సిబ్బంది మానవీయ విలువలు, ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు. జైలు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ ఎస్.విజయ్‌కుమార్ గొంతు క్యాన్సర్ చికిత్స కోసం స్వచ్ఛందంగా రూ.1.19 లక్షలు సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ మాట్లాడుతూ, బాధలో ఉన్న సహోద్యోగికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి మానవీయ బాధ్యత అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సిబ్బందిలో ఐక్యతను, పరస్పర నమ్మకాన్ని పెంపొందిస్తాయన్నారు. సహచర ఉద్యోగులు చేయూతనివ్వడంపై విజయ్ ధన్యవాదాలు తెలిపారు. జైలు పర్యవేక్షణాధికారి ఎంరాజ్‌కుమార్, గార్డింగ్ సిబ్బంది సతీష్, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన అంగన్‌వాడీలు

- సొంతగూడుకు నోచుకోని వందల కేంద్రాలు
- నియోజకవర్గంలో 223 కేంద్రాలు
- సొంత భవనాలు కేవలం 108
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



బ్రాహ్మణగూడెంలో మొండిగోడలతో దర్శనమిస్తున్న భవనం



శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



బ్రాహ్మణగూడెం కేంద్రంలో పాడైన భవనం స్లాబ్

చాగల్లు: నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు పడకేశాయి. దీంతో చాలీచాలని అద్దె భవనాల్లో, అరకొర వసతుల మధ్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలు లేకపోవడంతో నిర్వాహకులతోపాటు చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలోని 32 అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు విడుదుల చేసిన నిధులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే ఇరుకు గదులతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆటలు ఆడుకొనేందుకు స్థలం కూడా చాలా భవనాల్లో లేదు. విద్యాభివృద్ధి ఏటా కోట్లాది రూపాయాలను కేటాయిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం..అంగన్‌వాడీ కేంద్రాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు గ్రామాల్లో కేంద్రాలను అద్దె ఇళ్లలో, ప్రాథమిక పాఠశాల అరుగులపై నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. సరైన వసతులు లేక చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

సొంత భవనాలు 108

నియోజకవర్గంలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో 223 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిల్లో సుమారు పదివేల దాకా చిన్నారులు గర్భిణులు, బాలింతలు ఉన్నారు. నియోజకవర్గంలో 108 మాత్రమే సొంతభవనాలు ఉన్నాయి. చాగల్లు మండలంలో 29, తాళ్లపూడి మండలంలో 23, కొవ్వూరులో 56కి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 24 చోట్ల ప్రభుత్వ భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 91 చోట్ల అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.

నిలిచిపోయిన నిర్మాణాలు

నియోజకవర్గంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు సుమారు 16 నెలలు నుంచి నిలిచిపోయాయి. తాళ్లపూడి మండలంలో నిర్మిస్తున్న 22 భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. చాగల్లు మండలంలో ఊనగట్లలో రెండు భవనాలు, చాగల్లు, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో నిర్మాణ దశలో మొండి గోడలతో కనిపిస్తున్నాయి. కొవ్వూరు మండలంలో 8 చోట్ల భవన నిర్మాణాలు బేస్‌మెంట్, శ్లాబ్ దశల్లో నిలిచిపోయి దర్శనమిస్తున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి భవన నిర్మాణాల ప్రతిపాదనలకు తొలుత స్థలసేకరణ చేయాల్సి ఉందని అధికారులు అంటున్నారు. ఒక్కో భవనానికి 5 సెంట్లు స్థలం అవసరమని చెబుతున్నారు.

> **అనుమతులు వచ్చాక ప్రారంభిస్తాం**
>
> మండలంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి గ్రామాల్లో స్థల సేకరణ చేస్తున్నాం. నిర్మాణ దశలో ఉండి పనులు నిలిచిపోయిన చాగల్లు, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో రెండు భవనాలకు సంబంధించి శ్లాబ్ వేయడానికి నిధులు మంజూరయ్యాయి. అనుమతులు వచ్చాక పనులు ప్రారంభిస్తాం .
>
> –పీవీ.పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, చాగల్లు మండలం

సొంత భవనాల్లోనూ సమస్యలు

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న సొంతభవనాల్లోను కొన్ని చోట్ల సమస్యలు వేధిస్తున్నాయి. భవనాలు అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకున్నాయి. బీటలు వారి ఉన్నాయని, వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీల వాపోతున్నారు. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, పిల్లలకు ఆటపాటతో విద్య అందించడం, నిద్రపుచ్చడం వంటివి చేయాలి. అయితే అద్దె భవనాలు ఇరుకుగా వుండడం, కొన్ని భవనాలు శిథిలావస్థితిలో వుండడంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. వివిధ గ్రామాల్లో సొంత భవనాలు కూలే స్థితిలో వుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడానికి ఇష్టపడటం లేదు.

వైభవంగా వరదలమ్మ తల్లి జాతర



బంధపురంలోని వరదలమ్మ తల్లి ఆలయం

దేవరపల్లి: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తులచే కొలవబడుతున్న వరదలమ్మ తల్లి తీర్థమహోత్సవాలు గత రెండు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్నాయి. కొంతకాలంగా అమ్మవారి ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో దూపదీప నైవేద్యాలు నిలిచిపోయాయి. ఇటీవల పలువురు గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి దాతలు, గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మాణం చేశారు. అప్పటి నుంచి అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, తెలంగాణాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో అమ్మవారి తీర్థమహోత్సవాలను నిర్వహిస్తున్నారు. నేడు ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కోరుమామిడి, అమ్మేపల్లి, మేడిపల్లి గ్రామాలకు విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

త్రిసభ్య కమిటీల నియామకం

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీల)కు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉండగా, 16 సొసైటీలకు కమిటీలను ఏర్పాటు చేశారు. నల్లజర్ల సొసైటీకి కమిటీని ఏర్పాటు చేయవలసి ఉంది. ఈ నేపథ్యంలో మండలంలోని ఏడు సొసైటీలకు కమిటీలను ఏర్పాటు చేశారు. ముగ్గురు సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా నియమించారు. దేవరపల్లి సొసైటీ చైర్మన్‌గా ఉప్పులూరి నోమేంద్ర రామారావు, గౌరీపట్నం సొసైటీకి అంద్రు అనిల్, దుద్దుకూరు సొసైటీకి కరుటూరి శ్రీరామ్‌మూర్తి, యర్నగూడెం పెన్మత్స హేమ కుసుమ సుబ్బరాజు, త్యాజంపూడి సొసైటీకి చిటికిన రామకృష్ణ, చిన్నాయగూడెం సొసైటీకి గన్నమని గోపాలకృష్ణ, కురుకూరు సొసైటీకి యలమాటి భాస్కరావు చైర్ పర్సన్లుగా నియమితులయ్యారు. దాదాపు ఏడాది నుంచి సొసైటీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. దీంతో ఒక్కొక్క సొసైటీలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు కమిటీల్లో స్థానం కల్పించారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల నియామకం

నిడదవోలు రూరల్: మండలంలోని 12 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. శెట్టిపేట పీఏసీఎస్ చైర్మన్‌గా పాటంశెట్టి శివన్నారాయణ, సింగవరం పీఏసీఎస్ చైర్మన్‌గా పెన్మెత్స చందు, తాడిమళ్ల పీఏసీఎస్ చైర్మన్‌గా చింతల సర్వేశ్వరరావు, కోరుమామిడి పీఏసీఎస్ చైర్మన్‌గా మట్టపర్తి చంద్రరావు, కాటకోటేశ్వరం పీఏసీఎస్ చైర్మన్‌గా కస్తూరి వెంకట సుబ్బారావు, పురుషోత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా జుజ్జవరపు గోపాలకృష్ణ, పందలపర్రు పీఏసీఎస్ చైర్మన్‌గా ఆకుల వెంకట సూర్యనాగమోహన్‌రావు, డి.ముప్పవరం పీఏసీఎస్ చైర్మన్‌గా మేడా పూర్ణచంద్రరావు, సమిశ్రగూడెం చైర్మన్‌గా ఉప్పులూరి రామ్మోహన్‌రావు, కోరుపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కారింకి రామకృష్ణ వరప్రసాద్, పెండ్యాల పీఏసీఎస్ చైర్మన్‌గా వాకా సురేష్, శంకరాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా పోల్నాటి లీలాభాస్కర్లును నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో జారీ చేశారు.

త్రిసభ్య కమిటీల ఎంపిక

నిడదవోలు: పెరవలి మండలం సహకార సంఘాల త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కాపవరం సహకార సంఘం చైర్‌పర్సన్‌గా నందిపా శ్రీనివాస చక్రవర్తి, మల్లేశ్వరం చైర్‌పర్సన్‌గా మేడిచర్ల మాణిక్యాలరావు, అన్నవరప్పాడు వెంకట నాగేశ్వరరావు, ఖండవల్లి భూపతిరాజు రవి వర్మ, ముక్కామల వేంద్ర వెంకట రామ్మూర్తి, కాకరపర్రు పెనుమత్స వెంకట పతి వర్మ, తీపర్రు కంటిపూడి సూర్యనారాయణ, పిట్టల వేమవరం కర్రి శ్రీనివాస్ రెడ్డి, అజ్జరం నాగ పవన్ కుమార్, కానూరు వాకలపూడి వీర్రాజు ఎంపికయ్యారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో సమావేశం



కొవ్వూరులోని మీడియా కోఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు



సమావేశంలో పాల్గొన్న సోషల్ మీడియా ప్రతినిధులు

తాళ్లపూడి(కొవ్వూరు): వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మరింత ఉత్సాహంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి తలారి వెంకట్రావు ఆదేశించారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పార్టీ నియమించిన సోషల్ మీడియా కోర్డినేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు విషయాలపై దిశా నిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులను, కూటమి మోసాలను, పథకాల అమలు తీరును ప్రజలకు చేరువయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదునూరు నాగరాజు, సుంకర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పౌరులు దేశభక్తిని చాటాలి



నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహిస్తున్న కౌన్సిలర్లు, ఉద్యోగులు



కొవ్వూరు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో, ఎమ్మెల్యే, తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత అన్నారు. జాతీయ జెండా పట్ల గౌరవ భావం కలిగి ఉండి ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటాలన్నారు. కొవ్వూరు పట్టణంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలతో పట్టణంలోని మెయిన్ రోడ్డులో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమీషనర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 వరకు కొనసాగించాలి

నిడదవోలు: 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆగస్టు 15వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద దేశభక్తిని పెంపొందించేందుకు మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలనే నినాదాలతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, మున్సిపల్, సచివాలయ, మెప్మా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

దేవరపల్లి: పౌరుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని దేవరపల్లి, నల్లజర్ల మండల కేంద్రాల్లో ఆదివారం నిర్వహించారు. జాతీయ పతాకాలతో గ్రామాల్లో భారీ ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఆగస్టు 9 నుంచి 15 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భారత సాయుధ దళాలు, పోలీసు దళాలు పాల్గొంటారని తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీఓ వై.రాజారావు, మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాస్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. నల్లజర్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సింహాద్రిరావు నాయుడు, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, ఉపాధి హామీ ఏపీఓ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లపూడిలో 100 అడుగుల జెండాతో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్, ట్రైనీ ఎస్సై, తదితరులు

100 అడుగుల జెండాతో ర్యాలీ

తాళ్లపూడి: మండల కేంద్రం తాళ్లపూడిలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం తహసీల్దార్ లక్ష్మీ లావణ్య అధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. బజార్ సెంటర్‌లో 100 అడుగుల జాతీయ జెండాతో భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టారు.తహసీల్దార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలలో ప్రజలందరూ మమేకం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటిపై మూడు రంగుల జెండాను ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ట్రైనీ ఎస్సై ఆదిత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్ఫూర్తి కోసం హర్ ఘర్ తిరంగా

ఉండ్రాజవరం: నేటి పౌరుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీవో వి.రామారావు, తహసీల్దార్ పీఎన్‌డీ.ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం ఉండ్రాజవరంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, డ్వాక్రా మహిళలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది జాతీయ పతాకాలు చేత పట్టుకుని గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, ఎంఈవో సక్సేనా రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్న అధికారులు



నల్లజర్లలో ప్రదర్శన చేస్తున్న అధికారులు

రోడ్డు ఇలా..రాకపోకలు ఎలా!

- అధ్వానంగా దుద్దుకూరు రహదారి
- ప్రమాదాలతో ప్రయాణికుల బెంబేలు



దుద్దుకూరు వద్ద రోడ్డుపై పేరుకుపోయిన బురద

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు రాష్ట్ర ప్రధాన రహదారి దుస్థితి అధ్వాన్నంగా మారింది. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులకు పట్టదా? అని ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారిందని ముక్కున వేలేసుకుంటున్నారు. బస్సులు, ఆటోలు, క్వారీ లారీలతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారుతున్నాయని, ఈ రహదారిలో ప్రయాణమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి నుంచి ఐ.పంగిడి వరకు రోడ్డు చినుకు పడితే బురద, ఎండ కాస్తే ఎగసిపడుతున్న దుమ్ముతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా క్వారీలు, క్రషర్లు విస్తరించి ఉండడంతో క్వారీల్లోని మట్టి లారీల ద్వారా రహదారిపై చేరడంతో బురదమయంగా మారుతుంది. బంధపురం అడ్డరోడ్డు వద్ద పొలాల్లోని నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఈ ప్రాంతం చెరువును తలపిస్తోందని ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే రహదారి దుస్థితిని మెరుగుపర్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బంధపురం అడ్డరోడ్డు వద్ద దుస్థితి